క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారిగా కృష్ణ



నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న చారుగండ్ల కృష్ణను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కళాశాల అధికారిగా నియమిస్తూ శుక్రవారం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పి.మధు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య, అధ్యాపకులు పిచ్చిరెడ్డి, శ్రీధర్ అభినందనలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి పరామర్శ



వెంకటరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇటీవల మృతి చెందిన పశ్య వెంకటరెడ్డి, గోసుల వీరబాబు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కేఎల్‌ఎన్‌రెడ్డి, అమర్‌గౌడ్, చంద్రమౌళి, రాంబాబు, అంజి, నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గోదాదేవికి హరిద్రాలంకారం



హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శుక్రవారం ఆలయంలోని గోదాదేవి మూలవరులకు హరిద్రాలంకారం చేశారు. ప్రాతః కాలార్చన విష్ణు సహస్రం, గోదా, రామాజ అష్టోత్తరాలు, తిరుప్పావై సేవాకాలం తదితర వైదిక క్రతువులను అర్చకులు నిర్వహించారు. సాయంత్రం ముకుంద మాల స్తోత్రం పఠిస్తూ పల్లకీ సేవ నిర్వహించారు. నీరాజన మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు, ఆలయ అధికారులు, ధర్మకర్తలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో సహస్ర కుంకుమార్చనలు



సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చనలు, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, యరగాని కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్వామివారి శోభాయాత్రను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈఓ కొండారెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న నిర్వహించబోయే స్వామివారి శోభాయాత్రను జయప్రదం చేయాలని ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని రామాలయంలో నిర్వహించిన స్వామివారి శోభాయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శోభాయాత్రలో అన్ని వర్గాల ప్రజలు, భక్తులు, మహిళలు విశేషంగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, పుర ప్రముఖులు జి.రమేష్, కె.సూర్యప్రకాష్‌రావు, జి.రామయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, బి.సైదులు, కె.వెంకట నరసింహమూర్తి, పి.నారాయణరెడ్డి, కె.అరవింద్‌రెడ్డి, జె.శంభయ్య, బి.కొండయ్య, కె.నందయ్య, ఎ.రాము, లింగయ్య, జి.వెంకటేశ్వర్లు, పిచ్చయ్య, కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు, అర్చకులు పాల్గొన్నారు.

వందరోజుల్లో గ్యారంటీల అమలు

- కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి

కోదాడ : అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. శుక్రవారం కోదాడ పట్టణ పరిధిలోని 30వ వార్డులో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చూస్తుందని అన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారి రంగాచారం, బుర్రా ప్రమోద్‌రెడ్డి, కాటంరెడ్డి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోదాడ : 30వ వార్డులో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి



హుజూర్‌నగర్‌లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా త్రిపురవరంలో ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై అధికారుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు అందించేందుకు వచ్చిన గ్రామస్తులతో మాట్లాడి, ఆరు గ్యారంటీలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఆరు గ్యారంటీలు అందించేవిధంగా ఆధికారులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొణతం ఉమాశ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ మందడి వీరమ్మరంగారెడ్డి, ఎంపీడీఓ పరిమి విజయ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసమే ప్రజాపాలన : ఆర్డీఓ

గరిడేపల్లి : ప్రజల కోసమే ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తుందని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గారకుంటతండా, సర్వారం, లక్ష్మీపురం, కాల్వపల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ బండ కవిత, డీటీ మౌనిక, ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, సర్పంచ్‌లు గుగులోతు బాబునాయక్, కర్నాటి నాగిరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి, కుసుమ వెంకటమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీబీకేలు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుకే గ్రామసభలు

హుజూర్‌నగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసేందుకే వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. హుజూర్‌నగర్‌లో జరుగుతున్న ప్రజాపాలన వార్డు సభలలో శుక్రవారం ఆయన పాల్గొని అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలోని 13, 27 వార్డుల సభలలో మొత్తం 1,840 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రజాపాలన

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజా సంక్షేమానికే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వేపలసింగారంలో 5వ రోజు ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీడీఓ లావణ్యతో కలిసి ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, కుందూరు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి పెండెం నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

చిలుకూరు : మండల వ్యాప్తంగా గల గ్రామాల్లో శుక్రవారం అధికారులు ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు శనివారం చివరిరోజు కావడంతో ప్రజలు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు అందజేస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సరిత, గ్రామ కార్యదర్శులు, జీపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : అభయాస్తం ఆరు గ్యారంటీ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 14 వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, కౌన్సిలర్ వేమూరి నాగవేణి, నాగయ్య, మేనేజర్ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

మోతె : అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మామిళ్లగూడెం, హుస్సేన్‌బాద్, తుమ్మలపల్లి, కొత్తగూడెం గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మెట్టు అలివేలు, వాసంశెట్టి రమేష్, ఆరె పద్మ, యల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : అభయహస్తం దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు



చిలుకూరు : జెర్రిపోతులగూడెంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజాపాలన దరఖాస్తుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తా

నడిగూడెం: నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. మండల పరిధిలోని సిరిపురంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న శ్రీ రంగనాయకస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. చారిత్రాత్మక ఆలయాలను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామపెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. తదనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పద్మావతి తనిఖీ చేశారు. అదేవిధంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, ప్రత్యేక అధికారి డాక్టర్.రవికుమార్, సర్పంచ్ మొక్క లక్ష్మీవీణ, ఎంపీటీసీ శెట్టి జ్యోతి, పంచాయతీ కార్యదర్శి సతీష్, ఉపసర్పంచ్ శెట్టి సతీష్, మొక్క భిక్షపతి తదితరులు ఉన్నారు.



సిరిపురంలో శ్రీరంగనాయకస్వామి ఆలయ పనులను శంకుస్థాపన ఎమ్మెల్యే పద్మావతి

గీతకార్మికులందరికీ లైసెన్స్ ఇప్పిస్తా



గీత కార్మికులకు దరఖాస్తు పత్రాలు అందజేస్తున్న కెఎల్‌ఎన్ ప్రసాద్

మునగాల : జిల్లా వ్యాప్తంగా అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్స్ ఇప్పించేందుకు కృషిచేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్, కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కెఎల్‌ఎన్.ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆకుపాములలో 50 మంది గీత కార్మికులు కొత్త లైసెన్సులు దరఖాస్తు చేసుకునేందుకు గాను శుక్రవారం వారికి దరఖాస్తు పత్రాలను కెఎల్‌ఎన్.ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి సహకారంతో గీత కార్మికుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలంపల్లి వీరేందర్, పోలంపల్లి సైదులు, పోలంపల్లి వెంకటేశ్వర్లు, కేశగాని నాగేశ్వరరావు, సురగాని సైదులు, బొల్లికొండ రమేష్, పోలంపల్లి వీరబాబు, సురగాని కోటేశ్వరరావు, దొంతగాని సైదులు, గురుస్వామి పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతల పంపిణీ



నడిగూడెంలో అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న సభ్యులు



హుజూర్‌నగర్ : అయోధ్య శ్రీరాముడి అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : అయోధ్యలోని శ్రీరామ మందిరంలో పూజించిన అక్షింతలను శుక్రవారం హుజూర్‌నగర్‌లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఝాన్సీ, నిత్య, ఇందిర, కవిత, లక్ష్మి, తులసి, కవిత, భవాని, నాగమణి, గౌతమి పాల్గొన్నారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంతో పాటు రత్నవరంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో అయోధ్య రామమందిరం ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలకు భక్తులు శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సేవా సమితి అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

గుండ్లపల్లి వద్ద ఎత్తిపోతల పరిశీలన

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లి వద్ద కృష్ణానదిపై నిర్మించిన చౌటపల్లి, ఎర్రగట్టు ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం ఐడీసీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల పథకం మేనేజ్‌మెంట్ రైతులు వెన్నా భద్రారెడ్డి, చింతల వెంకటనారాయణలు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో నడిపించేందుకు, చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించాల్సిందిగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐడీసీ డీఈ భిక్షం, ఏఈ శ్రీనివాస్ లిఫ్టు పరిధిలోని రైతులతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు తెలిపినట్లు చెప్పారు. వారి వెంట లిఫ్టు పరిధిలోని రైతులు తదితరులు ఉన్నారు.



ఎత్తిపోతలను పరిశీలిస్తున్న ఐడీసీ అధికారులు, రైతులు

మఠంపల్లి జీపీ రికార్డులు స్వాధీనం

మఠంపల్లి : మఠంపల్లి మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కోదాడ డీఎల్‌పీఓతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని క్యాష్‌బుక్‌లు, ఎంబీ తదితర రికార్డులను తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీఎల్‌పీఓ శ్రీరాములు, ఎంపీవో ఆంజనేయులు, ఇన్‌చార్జి కార్యదర్శి మట్టయ్య తదితరులున్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని నోడల్ అధికారి శోభన్ బాబు, సీనియర్ నాయకుడు ఎం.జానిమియా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండి.మౌలానా, మండల అధ్యక్షుడు రామినేని సతీష్, ప్రధాన కార్యదర్శి పి.కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

మోతె : మండలంలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను మండల విద్యాధికారి కె.గోపాల్ రావు, మండల నోడల్ అధికారి బీఎల్‌ఎన్ చారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు దామళ్ల కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మోతె : టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గోపాల్‌రావు, ఉపాధ్యాయులు

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

నడిగూడెం : వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల విద్యాధికారి ఎం.సలీం షరీఫ్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని తెల్లబల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల ఫోన్‌లో స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు యాప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు జయ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎదుటే..

- పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



కొమ్ముబండతండా గ్రామ పంచాయతీ ఎదుట రోడ్డుపై పారుతున్న మురుగు

చిలుకూరు : గ్రామాల్లో ఎక్కడో చివరి వీధుల్లో పారిశుద్ధ్యం లోపించిందంటే గ్రామ పంచాయతీ అధికారులకు, సిబ్బందికి కనబడలేదు అనుకోవచ్చు కానీ మండలంలోని కొమ్ముబండాతండాలో ఏకంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుటే మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. గ్రామ కార్యదర్శి, సిబ్బంది గ్రామ పంచాయతీకి నిత్యం వస్తూ వెళ్తుంటారు కానీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్యం గురించి మాత్రం వారు పట్టించుకోవడం లేదు. జీపీ ఎదుట అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

అయ్యప్ప మాలధారులకు ముస్లింల అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ముస్లింలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో ఉన్న గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు శుక్రవారం పట్టణానికి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ డివిజన్ నాయకుడు ఎస్‌కె. భాజాన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు హిందూ, ముస్లింల మతసమరస్యానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇమ్రాన్, రఫీ, మహ్మద్ అలీ, ఖాసీం, నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, సీతారాంసింగ్, సూర్యారెడ్డి, రంగా, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ఐఎస్‌టీఎస్‌ఓ ఒలింపియాడ్ పరీక్ష మొదటి లెవల్‌లో ప్రతిభ చూపినట్లు డీజీఎం సుధాకర్, హెచ్‌ఎం పీవీ రమణారావు శుక్రవారం తెలిపారు. ప్రాథమిక పాఠశాల నుంచి 86 మంది, ఉన్నత పాఠశాల నుంచి 127 మంది విద్యార్థులు రెండో లెవెల్‌కు ఎంపికై నట్లు వారు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, ధ్రువపత్రాలను అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రేమ్ సాగర్, శ్రీనివాస రెడ్డి, నాగకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెడల్స్, ధ్రువపత్రాలతో విద్యార్థులు

అర్హులందరికీ తప్పనిసరిగా ఆరు గ్యారంటీలు అందించాలి

కోదాడఅర్బన్ : ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన పేదలందరికీ తప్పనిసరిగా అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కోదాడ పట్టణంలోని 23వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులేని వారికి తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, పి.కృష్ణ, కె.నవీన్, మరియన్న, భీమయ్య పాల్గొన్నారు.

నేడు శ్రీదేవనాథ జీయర్ స్వామి రాక

భానుపురి (సూర్యాపేట): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జిల్లాలలో పర్యటిస్తున్న త్రిదండి దేవనాథ జీయర్ స్వామి శనివారం సాయంత్రం సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం, ఆదివారం ఉదయం 7గంటలకు శ్రీవేణుగోపాల స్వామి ఆలయానికి రానున్నారని ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, మురళీధరాచార్యు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం, స్వామివారి మంగళ శాసనాలు ఉంటాయని పేర్కొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మునగాల : వ్యాపార రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించి వినియోగదారుల మన్ననలు పొందాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో ఈవీ బైక్ షోరూం, జీటీ, ఈవీ చార్జింగ్ స్టేషన్‌తో పాటు మండల కేంద్రం శివారులో ఈవీ బైక్ షోరూమ్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, ఎంపీపీ ఎలక బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, బైక్ షోరూం యజమానులు అన్నెం బుచ్చిరెడ్డి, గడ్డం కాశీం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, కొప్పుల జైపాల్‌రెడ్డి, ఎలక నరేందర్‌రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, కాసర్ల బోస్, కాసర్ల కోటేశ్వరరావు, సర్పంచ్‌లు గోపిరెడ్డి వెంకటరెడ్డి, కొప్పుల వీరమ్మ, ఆయా కంపెనీల సిబ్బంది పాల్గొన్నారు.



బరాఖత్‌గూడెం శివారులో ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

చిరువ్యాపారులకు దీర్ఘకాలిక రుణాలివ్వడం అభినందనీయం

కోదాడఅర్బన్ : చిరువ్యాపారులకు భద్రాద్రి కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు ఎలాంటి షూరిటీ లేకుండా దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడం అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే ఎన్ పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని నయానగర్ అనంతగిరి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాద్రి కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆమె కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంక్ సేవలను పట్టణంలోని చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ తమ బ్యాంక్ ద్వారా గృహ, వ్యాపార, విద్య, చిన్న తరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా కోఆపరేటీవ్ అధికారి నామా శ్రీధర్, స్థానిక కౌన్సిలర్ లంకల రమాదేవినిరంజన్‌రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కసినిడి జయప్రకాష్, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, గాదంశెట్టి శ్రీనివాస్, అక్కిరాజు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ కోదాడ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

గురుకులాల్లో ప్రవేశాల దరఖాస్తుకు నేడు ఆఖరు

హుజూర్‌నగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 5 చివరి తేదీ అని స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు హెల్ప్ లైన్ నంబర్ 1800 425 45678 లేదా ప్రభుత్వ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ని సంప్రదించాలని తెలిపారు.

గురుకుల ప్రవేశ పరీక్షపై ప్రచారం

నడిగూడెం : గురుకులాల ఉమ్మడి ప్రవేశ పరీక్షపై శుక్రవారం స్థానిక బాలికల గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈ నెల 6వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఎ.వెంకటేశ్వర్లు, డి.రవికృష్ణ, ఎస్.ఎస్. మూర్తి, నాగరాజు, కోటయ్య పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరిగింది. దీంతో గ్రామాల్లో ప్రజలు చలికి వణికిపోతున్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల వరకు కూడా గ్రామాల్లో మంచు కురిసింది. చిలుకూరు మండల కేంద్రంలో విద్యార్థులు మంచులోనే పాఠశాలకు వెళ్తూ ఇలా కనిపించారు. - చిలుకూరు